# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 14 । సెప్టెంబర్ । 2023






**వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే వీఆర్ఓ హత్య**

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య ప్రియుడితో కలిస వీఆర్ ఓ అయిన తన భర్తను అంతమొందించింది. - 8లో



**యువజనోత్సాహం**

కడప నగరంలోని సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు వేడుకగా సాగాయి. పలు కళాశాలల నుంచి విద్యార్థులు, కళాకారులు హాజరయ్యారు. - 8లో

గరిష్టం/కనిష్టం
33.9 /26.0

**వాతావరణం**

జిల్లాలో బుధవారం 26.0 - 33.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## న్యూస్‌రీల్

### దరఖాస్తుల ఆహ్వానం

**కడప కల్చరల్ :** ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ టూరిజం ఎక్సలెన్స్ పురస్కారాలు అందించనుందని వైఎస్సార్ జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్.మల్లికార్జున బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటక రంగంలో విశిష్ట సేవలదించిన వారికి గుర్తింపుగా వాటిని ప్రధానం చేస్తారన్నారు. వారంతా ఏపీ టూరిజం వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని ఈ నెల 19వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు స్వయంగా కానీ, పోస్టు ద్వారా కానీ విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్‌లోని రాష్ట్ర కార్యాలయానికి చేరేలా పంపాలన్నారు. అర్హత, సరైన ప్రమాణాలు కలిగిన దరఖాస్తులను పరిశీలించి ప్రపంచ పర్యాటక దినోత్సవం రోజున(సెప్టెంబర్ 27) పురస్కారాలు అందజేస్తారని తెలిపారు.

### కుమార స్వామికి వెండి ఆభరణం



వెండి ఆభరణం అందజేస్తున్న దాతలు

**వీరపునాయునిపల్లె :** సంగమేశ్వరాలయంలోని కుమార స్వామికి వీరపునాయునిపల్లె గ్రామానికి చెందిన నల్రెడ్డి మహేశ్వర్‌రెడ్డి, రమాదేవి, వెంకటరెడ్డి, రాజేశ్వరి దంపతులు 2.5 కిలోల వెండి ఆభరణాన్ని దాతలు బుధవారం విరాళంగా అందజేశారు. రూ.2.5 లక్షల విలువగల ఈ ఆభరణాన్ని ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మలకు అందజేయగా స్వామికి అభిషేకం చేసి అలంకరించారు. దాతలు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

### నిత్యాన్నదానానికి విరాళం



దాతను సత్కరిస్తున్న దృశ్యం

**చక్రాయపేట :** గండిలోని శ్రీ వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ వ్యవసాయ సలహాదారు అంబటి కృష్ణారెడ్డి రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. బుధవారం ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డిని అంబటి కృష్ణారెడ్డి, ఆయన సతీమణి ఎర్రగుంట్ల మండలం తిప్పలూరు సర్పంచ్ పార్వతమ్మ, కుటుంబ సభ్యులు కలిసి విరాళాన్ని అందచేశారు. ఈ సందర్భంగా దాతకు తీర్థ ప్రసాదాలను, స్వామి వారి చిత్రపటాన్ని అందచేశారు. శేషవస్త్రంతో సత్కరించారు.

### రెజ్లింగ్ జట్ల ఎంపిక



**కడప స్పోర్ట్స్ :** కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపికలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికచేయనున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు విజయవాడలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రెజ్లింగ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎంపికలు నిర్వహించి జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో డీఎస్‌ఏ కోచ్ మస్తాన్, ఫిజికల్ డైరెక్టర్లు సాజిత్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ఎంపికైన క్రీడాకారులు..**

**అండర్-14 బాలురు :** కె.పి. చంద్రమౌళి, ఎస్.పవన్‌కుమార్, ఎం.గోవర్ధన్, ఎస్.విజయ్‌కుమార్, జి.ప్రశాంత్, పి.సుదీప్, ఎస్. సమీర్, ఎన్. నవీద్, ఎ. యశ్వంత్‌కుమార్, బి. చరణ్‌తేజ.

**అండర్-14 బాలికలు :** ఇ. అఖిల, జి.సాత్విక, పి. అక్షిత, ఎస్. ఆయేషాబేగం, వి.ఉమామహేశ్వరి, ఎస్. సాబీర, కె. హేమప్రియ, కె.వెంకటలక్ష్మి, ఎస్. హలీమ, ఎన్. లక్ష్మిదేవి.

### డాక్టరేట్ ప్రదానం



రవికుమార్

**జమ్మలమడుగు:** పట్టణానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పెనుగొండ రవికుమార్‌కు జపాన్‌కు చెందిన ఏఐజెడ్‌యూ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రాగే ఉదయ్‌కిరణ్, యుటకవటనోబెల పర్యవేక్షణలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోషియేషన్ రూల్ మైనింగ్‌లో ఆయన చేసిన పరిశోధనలను ఆమోదించిన యూనివర్సిటీ బుధవారం డాక్టరేట్ ప్రదానం చేసింది.

## ఉపాధి లక్ష్యంగా..
# పరిశ్రమలు వేగంగా..

- వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు
- ప్రారంభానికి సిద్ధమవుతున్న సెంచురీ పానల్స్ కంపెనీ
- రూ.18 వేల కోట్లతో కొప్పర్తిలో పరిశ్రమలు
- జమ్మలమడుగు వద్ద రూ.15 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్



శరవేగంగా నిర్మితమవుతున్న సెంచురీ పానల్స్

**సాక్షి ప్రతినిధి, కడప :** కార్మికుల శ్రమ ఉత్పత్తి నిల్వలు పెంచుతుంది.. పరిశ్రమ రాష్ట్ర ప్రగతిని పెంచుతుంది. వైఎస్సార్ జిల్లాలో ప్రభుత్వం దీనిని నిజం చేస్తోంది. పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జిల్లాను.. పరిశ్రమల ఖిల్లాగా తీర్చిదిద్దుతున్నారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చి.. వేలాది ఎకరాలను పారిశ్రామికవాడలుగా రూపుదిద్దుతోంది. పెట్టుబడి దారులకు పెద్ద ఎత్తున ఆహ్వానం పలుకుతూ లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారిశ్రామిక వన్నె తెచ్చి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

### జమ్మలమడుగుకు కీర్తి కిరీటం

జెఎస్‌డబ్ల్యూ స్టీల్స్ లిమిటెడ్ ద్వారా ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఫిబ్రవరి 15న భూమి పూజ చేసి జమ్మలమడుగుకు కీర్తి కిరీటం తెచ్చారు. ఎకరా రూ.1.65 లక్షల చొప్పున 3,148.68 ఎకరాలు పరిశ్రమకు కేటాయించారు.

రూ.725 కోట్లతో మౌలిక వసతులు కల్పించారు. తొలివిడతగా ఏడాదికి మిలియన్ టన్ను (10 లక్షల టన్నులు) ఉత్పత్తి సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జెఎస్‌డబ్ల్యూ సిద్ధమైంది. ఫేజ్-1లో రూ.3,300 కోట్లు వెచ్చించి 36 నెలల కాలపరిమితిలో పనులు పూర్తిచేయనున్నారు. మరో రూ.5.500 కోట్లతో ఫేజ్-2 నిర్మాణ పనులు పూర్తి కానున్నాయి. ఫేజ్-2 సైతం మార్చి 31, 2029 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

### ఉపాధి హబ్‌గా కొప్పర్తి..

కొప్పర్తి పారిశ్రామికవాడ ఉపాధి హబ్‌గా మారనుంది. చదువుకున్న ప్రతి యువకుడు ఉద్యోగ సాధనకు మరెక్కడో వెతికే పనిలేకుండా పోతుంది. ఇప్పటికే కొప్పర్తిలో 550 ఎకరాల్లో ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ) నెలకొల్పారు. మరో పది వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయి. దాదాపు లక్ష మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.

అక్కడే 3,155 ఎకరాల్లో జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు కాబోతుంది. దీంతో దాదాపు రూ.18 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. మరో 1.75 లక్షల ఉద్యోగాలు దక్కనున్నాయి. స్థానికులకే 75శాతం ఉద్యోగావకాశాలు కల్పించాలనే చట్టం కారణంగా యువతకు అపారంగా ఉద్యోగాలు దక్కనున్నాయి.

### డిక్సన్‌లో 1300 మందికి ఉద్యోగాలు..

వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లలో నిర్మించిన నాలుగు షెడ్లలో ఈఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ సంస్థ ఉత్పత్తి ప్రారంభించింది. ప్రత్యక్షంగా 1300 మందికి ఉద్యోగాలు లభించాయి. 1.5 లక్షల చదరపు అడుగుల సామర్థ్యం ఉన్న మరో 3 షెడ్లు డిక్సన్ కంపెనీ తీసుకుంది. మరో ప్లాంట్ విస్తరించేందుకు సిద్ధమైంది. దీతోపాటు డిజికాన్ సొల్యూషన్స్ ఎల్ఎల్‌పి, సెల్‌కాన్ రిజల్యూట్, చంద్రహాస్ ఎంటర్‌ప్రైజెస్, యూటీఎస్‌పీఎల్ ఏర్పాటుకానున్నాయి. ఈ ఆరు సంస్థల ద్వారా దాదాపు రూ.600 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. దాదాపు 7500 ఉద్యోగాలు అందనున్నాయి. వీవీడీఎస్ సంస్థ కూడా రూ.365 కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఈ సంస్థ ద్వారా 6400 ఉద్యోగాలు రాబోతున్నాయి. బ్లాక్ పెప్పర్, హార్మోనిసిటీ ఎలక్ట్రానిక్ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యాయి. టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఐఓటీ డివైజ్‌లు, ట్యాబ్లెట్ల తయారీ తదితర వస్తువులు తయారవుతాయి. వీవీడీఎస్‌సంస్థ 5జీ హార్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్, బిగ్ డేటా, ఎనలిటిక్, ఒరిజినల్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ చేయబోతోంది.

### పులివెందులలో ఆదిత్య బిర్లా, అపాచీ..

పులివెందులలోని ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పార్కులో రూ.110 కోట్లతో 13 ఎకరాలల్లో ఆదిత్య బిర్లా ఫ్యాషన్ రీటైల్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుచేస్తోంది. ఇందులో రెండు వేల మంది మహిళలకు ఉద్యోగాలు లభించనున్నాయి. ఇదే ప్రాంతంలో రూ. 600 కోట్లతో అపాచీ కంపెనీ లెదర్ పరిశ్రమ బూట్లు, పాదరక్షల తయారీ కంపెనీ ఏర్పాటుచేయనుంది. తద్వారా మరో 2 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది.

### సెంచురీ పానల్స్ సంస్థ సిద్ధం..

బద్వేల్ సమీపంలోని కృష్ణపట్నం-బళ్లారి జాతీయ రహదారిలో గోపవరం వద్ద సెంచురీ పానల్స్ లిమిటెడ్ సంస్థ ప్రారంభానికి సిద్ధమౌతోంది. 589 ఎకరాల్లో రూ.1600 కోట్ల పెట్టుబడులతో ఈ పరిశ్రమ ఏర్పాటవుతోంది. 2,662 మందికి ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు కల్పించనుంది. 2023 డిసెంబర్ నాటి రెండో దశల పనులు పూర్తి కానున్నాయి. ప్రాజెక్టు ఆరంభిస్తే రోజూ 2 వేల టన్నుల కర్రను వినియోగించనున్నారు. రెండో దశ తర్వాత రోజుకు 4000 టన్నుల కర్ర పరిశ్రమకు అవసరమవుతుంది. ఆ మేరకు సుబాబుల్, జామాయిల్, సర్వి కర్రకు పూర్తి డిమాండ్ ఏర్పడనుంది. 75శాతం స్థానికులు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ పరిశ్రమ ప్రారంభోత్సవానికి చైర్మెన్ సజ్జన్ భజాంకా డే అండ్ నైట్ పనులు చేయిస్తున్నారు.

**ముఖ్యమంత్రి ప్రణాళికతోనే..**

వైఎస్సార్ జిల్లా పారిశ్రామిక ప్రగతి సాధించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళిక రచించారు. ఆ మేరకు క్రమేపీ పరిశ్రమలు రూపుదిద్దుకుంటున్నాయి. సెంచురీ ఫ్లైబోర్డ్స్ సంస్థ ప్రారంభోత్సానికి సిద్ధమవుతోంది. సీఎం చేతుల మీదుగా డిక్సన్ కంపెనీ ప్రారంభమైంది. 75శాతం స్థానికులకే ఉద్యోగాలు కేటాయించాలనే నిబంధన కారణంగా స్థానికులకు ప్రత్యక్ష ఉపాధి లభించింది. కాల క్రమేణా లక్షలాది మందికి వైఎస్సార్ జిల్లాలో ఉద్యోగాలు దక్కనున్నాయి.

- వి విజయరామరాజు, కలెక్టర్

**యువతకు ఉద్యోగాల వెల్లువ**

యువతకు జిల్లాలో ఉద్యోగాలు విరివిగా దక్కనున్నాయి. కొప్పర్తి పారిశ్రామికవాడలో ప్రభుత్వ లక్ష్యం మేరకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారు. వైఎస్సార్ ఈఎంసీలో భారీగా పెట్టుబడులు రానున్నాయి. ఇప్పటికే డిక్సన్ కంపెనీలో 1300 మందికి ఉద్యోగాలు లభించాయి. రెండో ప్లాంట్ ఏర్పాటుకు ఆ సంస్థ ముందుకు వచ్చింది. సిద్ధంగా ఉన్న షెడ్లు అప్పగించేందుకు రెడీగా ఉన్నాం. గోపవరం వద్ద సెంచురీ ప్లై బోర్డ్స్ సంస్థ ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. జిల్లాలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు దక్కనున్నాయి.

- శ్రీనివాసమూర్తి, ఏపీఐఐసీ జడ్ఎం

## వైడీసీసీకి జాతీయ పురస్కారం

- ఈ నెల 26న జైపూర్‌లో అవార్డు ప్రదానం



డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణిని సన్మానిస్తున్న బ్యాంకు సీఈఓ, సిబ్బంది

**కడప అగ్రికల్చర్ :** వైడీసీసీ బ్యాంకుకు జాతీయ పురస్కారం దక్కింది. బ్యాంకుల పనితీరు ఆధారంగా నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ లిమిటెడ్ ఏటా జాతీయ స్థాయిలో అత్యుత్తమ బ్యాంకును ఎంపికచేసి అవార్డు అందజేస్తుంది. అప్పుల అభివృద్ధి వసూళ్లు, మూలధనం ఇతరత్రా వాటిని పరిగణలోకి తీసుకుని ఈ ఎంపిక జరుగుతుంది. 2021-22 సంవత్సరానికి వైఎస్సార్ డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ బ్యాంక్(డీసీసీబీ)ని అత్యుత్తమ బ్యాంకుగా ఎంపిక చేసి జాతీయస్థాయిలో మొదటి స్థానం ప్రకటించింది. సెప్టెంబర్ 26వ తేదీన జైపూర్‌లో బ్యాంకు చైరపర్సన్ మల్లెల ఝాన్సీరాణి, సీఈఓ కందుల రాజేంద్రకుమార్ సంయుక్తంగా ఈ పురస్కారం అందుకోనున్నారు. కాగా, అవార్డు ప్రకటనతో చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణిని కడప డీసీసీ బ్యాంకు అధికారులు బుధవారం ఘనంగా సన్మానించారు.

## సబ్ రిజిస్ట్రార్ల సస్పెన్షన్

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** వైఎస్సార్ జిల్లాలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను సస్పెండ్ చేసినట్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ శివరాం బుధవారం తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్ శ్యామలాదేవి, ప్రొద్దుటూరు సబ్‌రిజిస్ట్రార్ కె.రామలక్ష్మిలను సస్పెండ్ చేశారు. వీరి స్థానంలో కడపకు సుందరేషను, ప్రొద్దుటూరుకు రత్నమ్మలకు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్లుగా నియమించామన్నారు.

## మండల స్థాయిలోనే పరిష్కారం

**కలెక్టర్ విజయరామరాజు**



ప్రజల వినతులను పరిశీలిస్తున్న కలెక్టర్

**రాజుపాళెం :** సమస్యలు తెలుపుకొనేందుకు జిల్లా కేంద్రానికి రాలేని ప్రజలు మండల స్థాయిలోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవచ్చునని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. రాజుపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయి సమస్యలు మండల స్థాయిలో వేగంగా పరిష్కరించేలా సిబ్బంది పనిచేయాలన్నారు. జిల్లా అధికారులు సచివాలయాలను తనిఖీ చేసి పనితీరు వివరాలు పంపాలని అయన సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, ఎంపీపీ సలోమి, మండల ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్, తహసీల్దార్ ఇందిరారాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

**'జగనన్న ఆరోగ్య సురక్ష'కు ప్రాధాన్యం**

**కడప సెవెన్‌రోడ్స్ :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభమవుతుందని, 15వ తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. 16వతేదీ నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించాలన్నారు. అనంతరం గ్రామాల్లో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. పేషెంట్ వివరాలు ఆరోగ్యశ్రీ యాప్‌లో నమోదు చేయాలని, కార్యక్రమానికి ఎమ్మెల్యే, సర్పంచ్, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయి పైలట్ క్యాంపును ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్టలో స్థల పరిశీలన

**ఒంటిమిట్ట :** ఆంధ్ర భద్రాద్రి ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయం పరిధిలో శాశ్వత అన్న ప్రసాద కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలాలను పురావస్తు శాఖ అధికారులు శివకుమార్, రాఘవేంద్ర బుధవారం పరిశీలించారు. ఒంటిమిట్టకు వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని తాము అన్న ప్రసాద కేంద్రం నిర్మిస్తామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా రఘునాథ్‌రెడ్డి గతంలో టీటీడీకి విన్నవించారు. పురావస్తు శాఖ అనుమతులు కోరడంతో అధికారులు స్థలాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవో నటేష్ బాబు, డీఈ నాగరాజు, ఏఈ అమర్‌నాథ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పరీక్షల నిర్వహణలో నూతన నిబంధనలు

- వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

**వైవీయూ :** యోగి వేమన విశ్వవిద్యాలయం వార్షిక పరీక్షల నిర్వహణలో నూతన నిబంధనలు అమలు చేయనున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ ఆచార్య వైపీ.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, ఇతర విభాగాల అధిపతులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. వీసీ మాట్లాడుతూ పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు ఒకేచోట నిర్వహించడం కాకుండా, ఆయా శాఖలలో నిర్వహించేలా వికేంద్రీకరణ దిశగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై డిపార్ట్‌మెంట్ వారీగా ఎరీక్షలు నిర్వహించనున్నామన్నారు. సరికొత్త విధానంలో ప్రశ్నపత్రం నిర్వహణ పద్ధతి అమలు చేస్తున్నామని, ఆన్‌లైన్‌లో సంబంధిత హెడ్‌లకు కొన్ని నిమిషాల ముందు అందేలా చేస్తామన్నారు. పరీక్షలు పూర్తయిన వారం లోపు ఫలితాలు వచ్చేలా మూల్యాంకనం చేయాల్సి ఉంటుందన్నారు. పరీక్షల ప్రారంభం నుంచి ఫలితాలు ప్రకటించే వరకు రెగ్యులర్ అధ్యాపకులు ఎవరూ సెలవులు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రజుమంలో ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి, వివిధ శాఖల అధిపతులు పాల్గొన్నారు.



విభాగాధిపతులతో సమావేశం నిర్వహిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

## రేపటి నుంచి అండర్-19 క్రికెట్ పోటీలు

కడప నగరంలో ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకు ఏసీఏ అండర్-19 అంతర్ జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. కడపలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం క్రీడామైదానాల్లో పోటీలు జరుగుతాయని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్ తెలిపారు. టోర్నమెంట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

- కడప స్పోర్ట్స్

| తేదీ | జట్లు | వేదిక |
|---|---|---|
| 15-09-23 | కడప × రెస్ట్ ఆఫ్ సౌత్ | వైఎస్ఆర్ఆర్-ఏసీఏ |
| 15-09-23 | గుంటూరు × రెస్ట్ ఆఫ్ సెంట్రల్ | కేఎస్ఆర్ఎం |
| 15-09-23 | విశాఖపట్నం × రెస్ట్ ఆఫ్ నార్త్ | కేఓఆర్ఎం |
| 16-09-23 | కడప × గుంటూరు | వైఎస్ఆర్ఆర్-ఏసీఏ |
| 16-09-23 | రెస్ట్ ఆఫ్ సెంట్రల్ × రెస్ట్ ఆఫ్ నార్త్ | కేఎస్ఆర్ఎం |
| 16-09-23 | విశాఖపట్నం × రెస్ట్ ఆఫ్ సౌత్ | కేఓఆర్ఎం |
| 18-09-23 | కడప × విశాఖపట్నం | వైఎస్ఆర్ఆర్-ఏసీఏ |
| 18-09-23 | రెస్ట్ ఆఫ్ సెంట్రల్ × రెస్ట్ ఆఫ్ సౌత్ | కేఎస్ఆర్ఎం |
| 18-09-23 | గుంటూరు × రెస్ట్ ఆఫ్ నార్త్ | కేఓఆర్ఎం |
| 19-09-23 | విశాఖపట్నం × రెస్ట్ ఆఫ్ సెంట్రల్ | వైఎస్ఆర్ఆర్-ఏసీఏ |
| 19-09-23 | కడప × రెస్ట్ ఆఫ్ నార్త్ | కేఎస్ఆర్ఎం |
| 19-09-23 | గుంటూరు × రెస్ట్ ఆఫ్ సౌత్ | కేఓఆర్ఎం |
| 21-09-23 | రెస్ట్ ఆఫ్ నార్త్ × రెస్ట్ ఆఫ్ సౌత్ | వైఎస్ఆర్ఆర్-ఏసీఏ |
| 21-09-23 | గుంటూరు × విశాఖపట్నం | కేఎస్ఆర్ఎం |
| 21-09-23 | కడప × రెస్ట్ ఆఫ్ సెంట్రల్ | కేఓఆర్ఎం |

## కడప రైల్వేస్టేషన్ మేనేజర్‌గా శేఖర్ కుమార్

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఇటీవల కడప రైల్వేస్టేషన్‌లో నంద్యాల డెమో రైలు, గూడ్స్ రైలు పట్టాలు తప్పిన ఘటనలపై రైల్వే ఉన్నతాధికారులు పలువురిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కడప స్టేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్న డీఎన్ రెడ్డిని కర్ణాటకలోని కృష్ణ రైల్వేస్టేషన్ ఎస్ఎంఆర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గంగాయపల్లెలో పనిచేస్తున్న శేఖర్ కుమార్‌ను కడపకు బదిలీ చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రమేష్‌రెడ్డిని కర్ణాటకలోని తాంగుండి రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా, ఆయన స్థానంలో ఎర్రగుంట్ల ఎస్ఎంఆర్‌గా పనిచేస్తున్న ఎస్.జిలానీని కడప రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. కడప డిప్యూటీ ఎస్ఎంఆర్‌గా పనిచేస్తున్న లాల్‌బాబుసింగ్‌ను గుంతకల్లు డిప్యూటీ ఎస్ఎంఆర్‌గా బదిలీ చేశారు.

# తల్లీబిడ్డ చల్లగా....ఆరోగ్యం మెండుగా

- క్షేత్ర స్థాయిలో విస్తృత వైద్య సేవలు
- మాతా శిశు మరణాలు తగ్గించడమే సర్కారు లక్ష్యం
- ప్రతి నెలా 9, 10వ తేదీల్లో వైద్య సేవలు



**18,500**
జిల్లాలో గర్భిణులు



**17,400**
బాలింతలు



చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



రిమ్స్ నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఇంటికి వెళ్తున్న బాలింత

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** గర్భిణిగా పేరు నమోదు చేసుకున్నప్పటి నుంచి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించడంతోపాటు తల్లీ బిడ్డల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. దీంతోపాటు వైద్యం సకాలంలో అందించేందుకు ప్రత్యేక అంబులెన్స్ అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహిస్తూ మాతా శిశు మరణాల నివారణకు ప్రణాళిక రూపొందిస్తోంది.

**పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్**

ప్రతినెలా 9, 10వ తేదీలలో గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు హైరిస్క్‌లో ఉన్న వారిని ప్రత్యేక పర్యవేక్షణలో మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ లక్ష్యం. గర్భిణుల్లో పౌష్టికాహార లోపాన్ని అధిగమించేలా అవగాహన కల్పిస్తారు. తొలి కాన్పు గర్భిణులకు రూ.5000 అందజేస్తారు. 150 రోజుల్లోపు నమోదు చేసుకున్న వారికి తొలి విడతగా రూ. 1000, రెండో విడతగా రూ. 2000, ప్రసవం తర్వాత రూ.2000 అందిస్తారు. సచివాలయం వద్ద యూవిన్ పోర్టల్ ద్వారా బిడ్డకు టీకా అందజేతకు సంబంధించిన ధ్రువపత్రాలను తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో పొందవచ్చు.

**జననీ సురక్ష యోజన**

ఈ పథకం కింద ఆస్పత్రిలో మూడు రోజులపాటు తల్లీబిడ్డలకు అవసరమైన చికిత్స, ఉచిత భోజన సదుపాయం కల్పిస్తారు. పౌష్టికాహారానికి రూ.1000 అందిస్తారు. కాన్పు అయిన ఆస్పత్రిలోనే జనన ధ్రువ పత్రాన్ని జారీ చేస్తారు. పుట్టిన వెంటనే బిడ్డకు పోలియో, పచ్చ కామెర్లు, క్షయ రాకుండా టీకా వేస్తారు. ప్రసవానంతరం తల్లీబిడ్డలు ఇంటికి చేరాక 42 రోజుల వరకు ఆరు పర్యాయాలు మహిళా ఆరోగ్య, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు ఇంటికి వస్తారు. వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ సమస్యలు ఉంటే మెరుగైన వైద్యానికి సిఫార్సు చేస్తారు.

**99 వాహనాల ద్వారా**

జిల్లాలో గతంలో ప్రతి నియోజకవర్గానికి రెండు లేక మూడు మాత్రమే 108 వాహనాలు ఉండేవి. దీంతో 36 మండలాల వాసులకు అత్యవసర సమయంలో సేవలదించడం కష్టమయ్యేది. ఇందుకు స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సేవలను విస్తృతం చేశారు. 39 108 వాహనాలు 39, 19 తల్లీబిడ్డ అంబులెన్స్ 102), 39 104 వాహనాలు, రెండు నవజాత శిశు సంరక్షణ వాహనాలు ఏర్పాటు చేశారు. తల్లీబిడ్డలకు తక్షణమే వైద్య సేవలందించడం ద్వారా మాతా శిశు మరణాల రేటు తగ్గించేందుకు కృషి చేస్తున్నారు.

**హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ**



జిల్లాలో గర్భిణుల వైద్య పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రతి నెలా పరీక్షలు చేయించుకుంటే హై రిస్క్ సమస్యలు గుర్తించేందుకు వీలుంటుంది. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తారు. బిడ్డ రక్షణ, ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు గర్భిణులకు ఐదో నెలలో టిప్పా స్కాన్ చేయిస్తున్నాం. తద్వారా బిడ్డకు మరింత రక్షణ లభిస్తుంది. తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ బాగా మెరుగుపడింది.

- డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, కడప

## క్లుప్తంగా

### పాము కాటుతో మహిళ మృతి


లక్ష్మీదేవి(ఫైల్)

కమలాపురం : మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మల్లెం లక్ష్మీదేవి(53) పాముకాటుతో మృతి చెందినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. బుధవారం లక్ష్మీదేవి అదే గ్రామంలోని పొలాల్లో కూలి పనులు చేసేందుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో మినుము పంట కువ్వ వేస్తుండగా రక్త పింజరి అనే పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న తోటి కూలీలు చికిత్స నిమిత్తం 108 ద్వారా కమలాపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. మృతురాలికి భర్త సుబ్బరాయుడు, వివాహమైన కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### స్వదేశానికి చేరిన వైద్యవిద్యార్థి మృతదేహం

సంబేపల్లె : సంబేపల్లె మండలం, దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెకు చెందిన రావూరి శ్రీనివాసులు కుమారుడు గిరీష్ జార్జియా దేశంలోని టీబీలిసిలో మెడిసిన్ చదువుతూ ఈనెల 1న మృతి చెందాడు. విద్యార్థి మృతదేహం బుధవారం స్వగ్రామం చేరింది.

# యువజనోత్సాహం


విజేతలతో అతిథులు

**ఉత్సాహంగా సాగిన జిల్లాస్థాయి పోటీలు**

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని సెయింట్ జోసఫ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు వేడుకగా సాగాయి. బుధవారం స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లాలోని పలు కళాశాలల నుంచి విద్యార్థులు, కళాకారులు హాజరయ్యారు. కార్యక్రమానికి ఏపీ కాలుష్యనియంత్రణమండలి బోర్డు సభ్యుడు, 47వ డివిజన్ కార్పొరేటర్ పాకా సురేష్, స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ, కళాశాల కరస్పాండెంట్ ఆరోగ్యస్వామి విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టెప్ సీఈఓ మాట్లాడుతూ యువజనోత్సవాలు స్వామి వివేకానందుని జన్మదినం జనవరి 12వ తేదీ పురస్కరించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాకా సురేష్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు సాంస్కృతిక, చైతన్య కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన యువజనోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఒక చక్కటి వేదిక అన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

**విజేతల వివరాలు.. (ప్రథమ, ద్వితీయ)**
**జానపద నృత్యం (గ్రూపు):**
జయచంద్ర గ్రూప్, జి. శశికుమార్‌గ్రూప్
**జానపద గేయం (గ్రూపు) :**
తన్మయ్, జి. థెరిస


సాంస్కృతిక ప్రదర్శనల్లో యువత


జ్యోతిప్రజ్వలన చేస్తున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, పాకా సురేష్ తదితరులు

**జానపద నృత్యం (సోలో):**
ఎ. విష్ణుప్రియ, జి. కిరణ్‌కుమార్.
**జానపద గేయం (సోలో):**
ఎం. మారుతి, ఎస్. ఆయేషా
**ఫొటోగ్రఫీ :**
జి. విల్సన్, టి. ఉమామహేశ్వర్
**స్టోరీరైటింగ్ :**
ఎస్. సాదకున్నీసాబేగం, ఎం. సాయితేజస్విని
**పోస్టర్ మేకింగ్ :**
మలోత్‌కుమార్, ఎన్. ఏడుకొండలు.

# మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

**సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో**

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH | AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

**శిబిరం చిరునామా:**
పవన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్,
గవర్నమెంట్ ఐ.టి.ఐ ఎదురుగా,
అక్కాయపల్లి, కడప.

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 97059 07418

## నేరాల నివారణకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలి


కడపలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించి, సూచనలు చేస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమాండ్ కంట్రోల్ వీడియోవాల్‌ను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలు, బహిరంగ ప్రదేశాల్లో డ్రగ్స్, బాల్యవివాహాలు, 'దిశ' యాప్, మహిళలపై జరిగే నేరాలు, ఆన్‌లైన్, సైబర్ మోసాలు తదితర విషయాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అపార్ట్‌మెంట్‌లు, షాపుల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి వాటిని అమర్చుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప వన్‌టౌన్‌లో ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, రంగస్వామి, సిద్దయ్య, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, టూటౌన్‌లో సీఐ సయ్యద్ హాసం, సిబ్బంది ఉన్నారు.

## బహిరంగ ప్రకటన
### ఫారం నం. INC -26

(కంపెనీస్ (ఇన్ కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 30కి అనుగుణముగా)

**కంపెనీ యొక్క నమోదిత కార్యాలయము ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రానికి మార్పు చేయుట కోసం వార్తా పత్రికలో ప్రచురించబడే ప్రకటన**

**కేంద్ర ప్రభుత్వం సమక్షంలో సౌత్ ఈస్ట్ రీజియన్, హైదరాబాద్.**

కంపెనీస్ చట్టం, 2013లోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(4) మరియు కంపెనీస్ (ఇన్ కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 30లోని సబ్-రూల్ (5)లోని క్లాజ్ (a) విషయంలో

మరియు

KPC బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్, (CIN:U45200AP2001 PTC036587) కంపెనీల చట్టం, 1956 క్రింద నమోదై కాబడిన కంపెనీ మరియు దాని నమోదిత కార్యాలయం డోర్.నం. # 3-308, Y.M.R. కాలనీ, ప్రొద్దుటూరు- 516360, YSR కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా వద్ద గల వారి విషయంలో ... పిటిషనర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణా రాష్ట్రానికి తమ నమోదిత కార్యాలయాన్ని మార్పు చేయుటకు కంపెనీకి వీలు కల్పిస్తూ, సోమవారం, 04 సెప్టెంబర్, 2023న జరిగిన అసాధారణ సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన ప్రత్యేక తీర్మానం మేరకు కంపెనీ యొక్క మెమొరాండం ఆఫ్ అసోసియేషన్‌లోని మార్పును నిర్ధారించమని కోరుతూ కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 13 క్రింద కేంద్ర ప్రభుత్వానికి కంపెనీ దరఖాస్తు చేయుటకు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

కంపెనీ యొక్క నమోదిత కార్యాలయము ప్రతిపాదిత మార్పు ద్వారా ఏ వ్యక్తి ప్రయోజనాలకైనా, ప్రభావంనకు గురైతే ఇన్వెస్టర్ కంప్లైంట్ ఫారం దాఖలు చేయడం ద్వారా MCA- 21 పోర్టల్ (www.mca.gov.in) కు అందజేయవచ్చును. లేదా అందజేసి లేదా అతని/ ఆమె ప్రయోజన స్వభావం మరియు వ్యతిరేకించుటకు గల కారణాలను తెలియచేస్తూ అఫిడవిట్ ద్వారా ఆధారాలతో వ్యతిరేకించుటకు గల కారణాలను రీజనల్ డైరెక్టర్, చిరునామా: 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిన్నారం గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500 068, తెలంగాణా వారికి ఈ నోటీసు ప్రచారం తేదీ నుండి పద్నాలుగు రోజుల లోగా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా పంపవలెను. దానితోపాటు పైన తెలిపిన చిరునామా లో తమ నమోదిత కార్యాలయంలోని దరఖాస్తునకు కంపెనీకి కాపీ పంపవలెను.

KPC బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కొరకు మరియు తరఫున

తేది : 13.09.2023
ప్రదేశం : ప్రొద్దుటూరు.

కె. అనిల్ కుమార్
మేనేజింగ్ డైరెక్టర్
DIN : 00922959

# వ్యక్తి ఆత్మహత్య

- ఆర్థిక లావాదేవీలే కారణమని అనుమానం
- కడప రిమ్స్ పీఎస్‌లో కేసు నమోదు


గురునాథ్‌సింగ్ (ఫైల్)

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో సాయినగర్‌లో నివాసముంటున్న గురునాథ్‌సింగ్ (45) అనే వ్యక్తి బుధవారం ఆత్మతహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై అతనితో పాటు ఇంటిలో ఉంటున్న సుబ్రమణ్యం, నదీంఖాన్‌లను పోలీసులు విచారించారు. సుబ్రమణ్యం ఫిర్యాదు మేరకు రిమ్స్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కేసు నమోదు చేశారు. గురునాథ్‌సింగ్ ఆత్మహత్యకు ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. మహారాష్ట్ర రాష్ట్రంలోని ఫర్భానీజిల్లా కార్గోని రోడ్‌లో నివాసం ఉంటున్న సుబ్రమణ్యం, నదీంఖాన్, గురునాథ్‌సింగ్‌లు స్నేహితులు.

కడపలోని సాయినగర్‌లో రవీంద్ర అనే వ్యక్తి ఇంటిలో నివాసం ఉంటున్నారు. రవీంద్ర ఇచ్చిన సూచనల మేరకు తమ స్నేహితులతోనేగాక, కడపలోని ప్రజల నుంచి డబ్బులను సేకరించి డీఎఫ్‌టీ (దుబాయ్ ఫీచర్ టెక్నాలజీ) కంపెనీలో పెట్టుబడిగా పెట్టారు. వీరు ముగ్గురు రవీంద్ర దగ్గరనే దాదాపు కోటిరూపాయల మేరకు పెట్టుబడులుగా పెట్టించారు. రవీంద్ర కూడా తన స్నేహితుల దగ్గరి నుంచి పెట్టుబడులను పెట్టించారు. ఈ క్రమంలో కొన్ని రోజుల నుంచి ఆ సంస్థకు సంబంధించిన వారి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ చేశారు. ఎలాంటి స్పందన లేకపోవడం, వీరిపై ఒత్తిడి పెరగడంతో గురునాథ్‌సింగ్ మానసిక వేదనకు గురయ్యాడు. సుబ్రమణ్యం, నదీంఖాన్‌లు బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి వచ్చి అదే ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ సమయంలో తెల్లవారుజామున గురునాథ్ సింగ్ బాత్‌రూంలోకి వెళ్లి కిటికీకి ప్యాంటుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం 7:30 గంటల సమయంలో లేచిన సుబ్రమణ్యం, నదీంఖాన్‌లు బాత్‌రూంకు వెళ్లిన గురునాథ్‌సింగ్ ఎంతసేపటికి రాకపోగా, పిలిచినా పలుకకపోవడంతో బాత్‌రూం తలుపును బలవంతంగా తీశారు. కిటికీకి ఉరి వేసుకుని వేలాడుతుండటంతో రిమ్స్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందాడని రిమ్స్ వైద్యులు నిర్ధారించారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారికి పోలీసులు సమాచారం ఇచ్చారు. వారు వచ్చిన తరువాత పోస్టుమార్టం నిర్వహిస్తామని, పూర్తి విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలియని వృద్ధుడు (63) మృతి చెందాడు. అనారోగ్యంతో ఉన్న అతన్ని సోమవారం 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతని జేబులో జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు తీసుకున్న ఆర్టీసీ బస్సు టికెట్ ఉంది. మృతదేహాన్ని ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రిలోని ఔట్ పోస్టులో సంప్రదించాలని మార్చురీ అసిస్టెంట్ తేజా తెలిపారు.

## భూమి దున్నేశాడని పోలీసులకు ఫిర్యాదు

లక్కిరెడ్డిపల్లి : షేక్ దర్బార్‌బాషా అనే వ్యక్తి తన భూమిని అక్రమంగా దున్నేశాడని ఏపీ దివ్యాంగ సంఘాల జేఏసీ రాష్ట్ర కోశాధికారి రామరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పట్టా భూమిలో జూలై నెలలో జొన్న విత్తనాలు వేసినట్లు ఆయన తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన షేక్ దర్బార్ ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో తాను పొలం వద్ద లేని సమయంలో ట్రాక్టర్ టిల్లర్‌తో అక్రమంగా దున్ని వేశాడన్నారు.

# విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలి


మాట్లాడుతున్న జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎస్.రమణ

ప్రొద్దుటూరు : విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. స్థానిక విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో బుధవారం ప్రొద్దుటూరు విద్యుత్ డివిజన్‌లోని ప్రొద్దుటూరు, రాజుపాళెం, జమ్మలమడుగు, మైలవరం, ముద్దనూరు, పెద్దముడియం, కొండాపురం, ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, కమలాపురం మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ ఎస్.రమణ మాట్లాడుతూ విద్యుత్ వృథాను అరికడితే ఆదా చేసినట్టవుతుందన్నారు. పగటి పూట వీధి దీపాలు వెలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులు నిర్దేశించిన ప్రాంతాల్లో నివాసం ఉంటే ఆశించిన ఫలితాలు వస్తాయని తెలిపారు. కేటాయించిన ప్రాంతాల్లో నివాసం లేని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు, సిబ్బంది సంబంధిత ప్రాంతాల్లో విధిగా అందుబాటులో ఉండాలని తెలిపారు. విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని, లైన్లలో తిరిగి సమస్యలను గుర్తించి మరమ్మతులు చేయాలని సూచించారు. అంతరాయాలను అరికట్టి నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్‌ను జాప్యం లేకుండా ఇవ్వాలన్నారు. వాలిపోయిన స్తంభాలు, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. పనిచేయని ఉద్యోగులను విధుల నుంచి తొలగించి పై అధికారులకు సరెండర్ చేస్తామని, తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఈఈ జి.శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, జేఈలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

## సాక్షి క్లాసిఫైడ్స్

**EDUCATION**

■ చదువు మధ్యలో ఆపేసిన లేదా ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, PG, MCA, BCA, MBA, M.Tech, B.Tech పాసయ్యే చాన్స్ కలదు. నగేష్ అకాడమి, కడప. 7569470023 [G-7649]

**శ్రీ శ్రీనివాస I.T.I ప్రొద్దుటూరు**

■ 2023-24 సం॥నకు ఎలక్ట్రీషియన్ (80 సీట్లు), డ్రాఫ్ట్‌మేన్ సివిల్ (48 సీట్లు), ట్రేడుల యందు అడ్మిషన్లు జరుగుచున్నవి.చివరి తేది:19-09-2023 వెంటనే చేరుటకు సంప్ర: 9490633112. [C-777054]

**B.Sc. నర్సింగ్ అడ్మిషన్స్**

■ ఆన్‌లైన్ స్టార్ట్ (18th వరకు), ఓల్డ్ గర్ల్స్ కాలేజీలో Govt. సీట్స్ B.Sc., (నర్సింగ్)కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. Q : ఇంటర్ + AP EAPCET లో Any ర్యాంక్. సంప్ర: జి. మురళీ, సెల్ : 9030661651. ATP. [A-2731]

**REAL ESTATE**

■ ప్రొద్దుటూరు పట్టణంలో ఇళ్ళు, స్థలాలు భూములు, అపార్ట్‌మెంట్స్ కొనదలచిన వారు/ అమ్మదలచిన వారు. సంప్ర: చెమికల శ్రీనివాసులరెడ్డి, సెల్: 9885338730. [C-1220097]

**SERVICE**

**బంగారం కొనబడును**

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 5928]

**WANTED**

■ WANTED Teachers కడప నగరంలోని ప్రముఖ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు 6th to 9th IIT మ్యాథ్స్ ఫౌండేషన్, 6th, 7th,8th తెలుగు మరియు స్పోకెన్ ఇంగ్లీష్ బోధించుటకు అర్హత అనుభవం కల టీచర్లు మరియు 300 మంది విద్యార్థులకు కట్టెల పొయ్యి మీద వంట చేయుటకు వంట మనిషి కావలెను. సెల్:9292607689, 9059004664. [C-777053]

■ WANTED Pre- Primary And Primary Teachers For E.V.S., Computers Helping Teachers For Kamalapur AM School, Con:9966826698. [C-777247]

■ WANTED TEACHERS! Experienced Teachers with good communication Skills for handling India's Fastest growing Pre-school Hello Kids branch -2 in Kadapa. Contact: 6281155858, 9398387366. [C-1220012]

■ అర్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఇంగ్లీష్ బోధించుటకు టీచర్ కావలెను. అర్హత: MA ఇంగ్లీష్ B.Ed., ఫోన్: 8331951098. [C-1220247]

■ కడపలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో పనిచేయుటకు పంప్ బాయ్స్ /గర్ల్స్ కావలెను. జీతం: 11,500, న్యూ RTC బస్టాండ్. సంప్ర॥ 9705826592. [C-776955]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221614]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీతం:18K. హైదరాబాద్. Ph: 9640258899, విజయవాడ: 9640648899 [HA-612]

■ రెయిన్‌బో కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు కావలెను. 10th, ఇంటర్, పాస్/ఫెయిల్ కమీషన్ ఇవ్వబడును, 2వీలర్ కంపల్సరీ, ఫోన్ : 9398981980 [H-189492]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12,000-35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7993583999 [HA-608]

■ SSC/INTER/ డిగ్రీ, ITI, డిప్లొమా(P/F) అయ్యి ఖాళీగా ఉన్న 39(స్త్రీ/పు) మా సంస్థలో పని చేయుటకు కావలెను. జీ:14వేలు+DA 6 వేలు+ఫ్రీ రూం, నో ఫీజు. చెన్నూరు బస్టాండ్ దగ్గర, కడప.సెల్:95024 00850 [L-780975]

■ Wanted Sales Executives for leading Automobiles in Kadapa, Qul: Any Degree. ✆ 9100773493, Maild Id:hr@hoshikia.com [T-9788]

■ బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూంలో సెక్యూరిటీ గార్డ్స్ A: 25 & 50లోపు PF&ESI, జీ 10,000, 10th, Inter కడపలో పనిచేయుటకు వెంటనే కావలెను. 9989139239, 8179196300. [T-1225280]

■ నోబుల్ హెల్త్‌కేర్ సర్వీసెస్ అనంతపురము నందు వృద్ధులు, బెడ్ రీడన్ పేషెంట్స్ పక్షవాతం పేషెంట్స్, బేబీ కేర్, కేర్ టేకర్స్ 24 గంటలు పనిచేయుటకు ఓర్పుగల ఆయాలు, నర్సులు ఆడ మరియు మగ కావలెను. వారికి ఆకర్షణీయమైన జీతం మరియు ఉచిత భోజనము వసతి సదుపాయం కలదు. వివరాలకు సంప్రదించవలసిన నెంబర్లు 9441018078, 6301341831. [A-7315]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

## ఆ అవ్వే మరణిస్తే.. ఆ పాపం ఎవ్వరిది.!


ముదివేడు తానా మిట్ట వద్ద వృద్ధురాలు

ముగ్గుబుట్ట వంటి తలా.. ముడుతలు తేరిన దేహం.. కాంతిలేని గాజుకళ్లు.. తనకన్నా శవం నయం.. పడిపోయెను జబ్బు చేసి.. అడుక్కునే శక్తి లేదు.. రానున్నది చలికాలం.. దిక్కులేని దీనురాలు.. ఆ అవ్వే మరణిస్తే .. ఆ పాపం ఎవ్వరిది.. అంటూ మహాకవి శ్రీశ్రీ తన భిక్షువర్షీయసి కవితలో ఓ అనాథ వృద్ధురాలి దయనీయ గాథను మానవీయ కోణంలో ఆవిష్కరించారు. సరిగ్గా అలాంటి స్థితిలోనే ఓ వృద్ధురాలు కదలలేని స్థితిలో.. తన గురించిన వివరాలు చెప్పలేని పరిస్థితిలో.. కనీసం యాచించలేని దుస్థితిలో రోడ్డుపక్కన దీనంగా కూర్చుని ఉంటే ఆ దారిన వెళ్లే వారు ఆమె ఆకలి తీరుస్తున్నారు. కురబలకోట మండలం ముదివేడు మార్గంలోని తానామిట్ట వద్ద ఓ అవ్వ నిస్సహాయ స్థితిలో ఉంది. ఆమెకు సుమారు 80 ఏళ్లకు పైగా ఉంటాయి. చేతిపై అలివేలమ్మ అనే పచ్చబొట్టు ఉంది. ఆమె ఎక్కడి నుండి వచ్చిందో... ఎందుకు వచ్చిందో చెప్పలేకపోతోంది. భారమని బిడ్డలు ఈమెను వదిలించుకున్నారా.. లేదా బిడ్డలకు, కోడళ్లకు భారం కాకూడదని తానే వచ్చేసిందా..అనేది అంతుబట్టడం లేదు. జీవితంలో ఎన్ని కష్టాలు అనుభవించిందో ఏమో.. విశ్రాంతి తీసుకోవాల్సిన ముదిమి వయస్సులో ఈమె జీవిత ప్రయాణం కడు దుర్భరంగా మారింది. ఆమె దీన స్థితిని గమనించిన వారు కరుణతో ఆమెకు ఆహారం అందిస్తున్నారు.

– కురబలకోట

## మృత్యువులోనూ వీడని బంధం


వృద్ధ దంపతులు రామకృష్ణ, కమలమ్మ (ఫైల్)

పీలేరు రూరల్ : అనారోగ్యంతో ఉన్న వృద్ధ దంపతులు ఇద్దరూ ఒకే సారి తనువు చాలించిన సంఘటన పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డు మార్గంలోని ఆటో నగర్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆటో నగర్‌లో నివసిస్తున్న రొంపిచెర్ల రామకృష్ణ (83) ఆరు నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన భార్య కమలమ్మ (80) షుగర్, బీపీతో బాధపడుతోంది. కాగా, మంగళవారం రాత్రి సమయంలో ఇద్దరూ ఒకేసారి మృతి చెందారు. బుధవారం ఉదయం కుమారుడు రాజు వారు మృతి చెందిన విషయాన్ని గుర్తించాడు. ఎంతో అన్యోన్యంగా ఉన్న వృద్ధ దంపతులు ఒకే సారి చనిపోవడంతో మృత్యువులోనూ వీరి బంధం వీడలేదని ప్రతి ఒక్కరూ చర్చించుకున్నారు.

# వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే వీఆర్‌ఓ హత్య

- ప్రియుడితో కలిసి భర్తను అంతమొందించిన భార్య
- కేసును ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల అరెస్టు


హత్య కేసులో నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

రాయచోటిటౌన్ : తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన భార్య ప్రియుడితో పాటు మరొక వ్యక్తి సాయం తీసుకుని భర్తను అంతమొందించింది. ఆ తర్వాత తన భర్త బాత్‌రూంలో పడి చనిపోయాడని నమ్మించే ప్రయత్నం చేసింది. ఎట్టకేలకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులు ముగ్గురిని అరెస్టు చేశారు. బుధవారం రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన అంజి అలియాస్ ఆంజనేయులు నాయుడు రాయచోటి పట్టణంలో నివాసం ఉంటూ వీరబల్లె మండల కేంద్రంలో వీఆర్‌ఓగా విధులు నిర్వర్తించేవాడు. ఆయనకు భార్య నందిని, ఇద్దరు మగపిల్లలు సంతానం ఉన్నారు. అయితే నందినికి గొర్లమొదివీడుకు చెందిన మహదేవపల్లె చిన్నప్పరెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తన భర్తకు తెలియడంతో ఆమెను వారించేవాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవలు చోటు చేసుకొనేవి. తన భర్త తనను వేధిస్తున్నాడని ఎలాగైనా అంతమొందించాలని చిన్నప్పరెడ్డికి చెప్పింది. వెంటనే పథకం రచించారు. ఈనెల 9వ తేదీ శనివారం రాత్రి ఇంటికి రాగానే భోజనం వడ్డించింది. మజ్జిగలో నిద్రమాత్రలు కలపడంతో అతను భోజనం చేసిన కాసేపటికి మత్తులోకి జారుకున్నాడు. ఇదే అదునుగా భావించిన నందిని అప్పటికే సిద్ధంగా ఉన్న చిన్నప్పరెడ్డి, అతని స్నేహితుడు గొర్లమొదివీడు గ్రామానికి చెందిన మహదేవపల్లె సురేంద్రారెడ్డితో పాటు తాను కూడా బెడ్‌రూంలోకి వెళ్లి ముఖంపై దిండు ఉంచి గట్టిగా అదిమి పట్టుకున్నారు. అయితే అంజి నిద్రమత్తు నుంచి లేచి తేరుకొని గట్టిగా కేకలు వేశాడు. ఆ సమయంలో వారిమధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇక చేసేది లేక ముగ్గురు కలిసి బలవంతంగా అతని ముఖంపై దిండు వేసి గట్టిగా అదిమి పట్టుకున్నారు. కొద్దిసేపటి తరువాత ఊపిరి ఆగిపోయింది. మృతి చెందాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే హత్య కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో చిన్నప్పరెడ్డి తన చేతులకు గ్లౌజులు ధరించాడు. అలాగే పట్టణంలో సీసీ కెమెరాల కంటబడకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో మృతుడి భార్య నందిని తన భర్త బాత్ రూంలో పడి చనిపోయాడని చెప్పి పోలీసులను నమ్మించే ప్రయత్నం చేసింది. కానీ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టడంతో నిజాలు వెలుగు చూశాయి. హత్యకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించిన అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, అర్బన్ ఎస్‌ఐ నరసింహారెడ్డిలకు రివార్డు కోసం జిల్లా ఎస్పీకి సిఫార్సు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ తులశీరాం పాల్గొన్నారు.